కథ

# పెద్దకొడుకు

నేను మనిషిని కాను.
జంతువుని కాను.
కనీసం
చిన్న పురుగుని కూడా కాను.
అయినా,
మా నాన్నకి నేను పెద్ద కొడుకుని!
అదెట్లా?

మా వూరు అయ్యలూరు. మా నాన్నగారి పేరు వెంకటస్వామిగారు. చాలా ఆలస్యంగా పెళ్ళి చేసుకున్నారు. మా అమ్మ సావిత్రమ్మంటే ఆయనకు ఎనలేని ప్రేమ.

పొలం పనిలో కూలి పని చేసుకుంటూ అమ్మని ప్రేమతో చూసుకుంటున్నారు. పెద్ద దిక్కు లేదు. ఆ ఇంట్లో వాళ్ళిద్దరే ఉంటున్నారు. బంధువులు ఊరు వదిలేసి పట్నం వెళ్ళిపోయారు.

పెళ్ళయిన ఆరేళ్ళ తర్వాత మా అమ్మ నాన్నగారి దగ్గరకు వచ్చింది. సిగ్గుపడుతూ ఆయన చెవిలో గుసగుసలాడింది. ఏదో కావాలని అడిగింది.

మా నాన్నగారు నవ్వారు. సంబరపడ్డారు. ఎగిరిగంతులేశారు.

కాలం కాని కాలంలో ఆమె కోరినది వూళ్ళో దొరకదు. దాని కోసం ప్రత్యేకంగా పట్నానికి బయల్దేరారు.

పట్నం అంతా గాలించారు. చివరికి ఆయనకు కావల్సింది పెద్ద మార్కెట్లో దొరికింది.

పది రూపాయలకు ఒకటి!

ఊరివాళ్ళు చూసి ఎగతాళి చేస్తారని దాన్ని పంచెలో దాచి పెట్టుకుని తెచ్చారు. ఆప్యాయంగా దానిని మా అమ్మ చేతిలో పెట్టారు.

మా అమ్మకి చాలా సంతోషం కల్గింది. నాన్న వైపు ప్రేమగా చూసింది. కత్తి తీసుకుని దాన్ని ముక్కలు ముక్కలుగా కోసింది.

కమ్మగా, పుల్లపుల్లగా, తీయతీయగా ఉందది. తను తింటూ నాన్నగారి నోటికి రెండు ముక్కలు అందించింది.

అంతా తినేశాక మిగిలింది టెంక!

పక్కింటి వాళ్ళు చూసి నవ్వుకుంటారని మా నాన్న ఆ టెంకని ఇంటి ఆవరణలో ఒక మూల భూమిలో పాతిపెట్టారు.

నెలలు చకచకా దొర్లిపోతున్నాయి.

అమ్మ పొట్ట స్పష్టంగా కనిపిస్తోంది.

ఆడవాళ్ళందరూ ఆనందించారు. ఆట పట్టించారు.

నాన్నగారు మీసాలను మెలి వేసుకున్నారు.

నెలలు నిండాయి.

కాన్పు నొప్పులు అధికమయ్యాయి.

నాన్నగారు కాన్పు చేసే మంత్రసానితో బాటూ మరో ముగ్గురు ఆడవాళ్ళని వెంటబెట్టుకొచ్చారు.

సరిగ్గా అదే సమయంలో నేనూ పుట్టాను!! చిన్న మొలక రూపంలో!

నాకు భలే సంతోషం కల్గింది. నా చిన్నారి రెండు ఆకులు ఆనందంగా కదిలాయి.

ఇహ ముసుగులో గుద్దులాటెందుకూ?

నేనెవరినో మీకు యీపాటికి తెలిసిపోయింది కదూ?

ఔను.

నేను మనిషిని కాను. మామిడి మొక్కని!

కొడుక్కి సూర్యుడు..అని పేరు పెట్టారు.

ఆరోజు నాన్నగారు అందరిని విందుకి పిలిచారు. వాళ్ళూ కానుకలు తెచ్చారు. భోజనం చేశారు. వాళ్ళు చేతులు కడుక్కోవడానికి నీళ్లు అందిస్తున్నప్పుడు-అప్పుడు-నా వైపు చూశారు.

ఆశ్చర్యంగా, ఆనందంతో నావైపు మళ్ళీ మళ్ళీ చూశారు.

అతిథులందరూ వెళ్ళిపోయాక ''సావిత్రీ! సావిత్రీ! ఇలారా. ఇదిగో ఇటు చూడు. మనం పాతి పెట్టిన టెంక మొలకెత్తింది. చూడు..చూడు..'' అన్నారు.

ఆయన గుండెలో బండెడు భావావేశం.

అమ్మకి సూరీడ్ని చూసుకోవడంతోనే సరిపోయింది. నాన్నగారు మాత్రం అశ్రద్ధ చేయలేదు. రోజుకి రెండు పూటలు నీరు పోసేవారు. నేనంటే ఆయనకెంతో ఇష్టం. నావైపు చూపిస్తూ ''నా పెద్దకొడుకు'' అంటూ అమ్మతో ఎన్నిసార్లు చెప్పారో?

నాతోబాటూ సూరీడు పెద్దవాడయ్యాడు. బుద్ధిమంతుడు. వాడికి చదువంటే చాలా శ్రద్ధ.

మా ఊరిలో హైస్కూల్ మాత్రమే ఉంది. సూరీడు మంచి మార్కులతో పాసయ్యాడు. తనింకా పై చదువులు చదువుతానన్నాడు. నాన్నగారికి సంతోషం కల్గింది. వాడ్ని పట్నం పంపించారు. మంచి హాస్టల్లో ఉంచి కాలేజీలో చేర్పించారు.

ఒకరోజు విపరీతమైన వర్షం ప్రారంభమైంది. ఉరుములు, మెరుపులు, పిడుగులు. ఊరు ఊరంతా వర్షం నీళ్ళతో కొట్టుకుపోతుందేమో అన్నంత కుండపోత వాన. ఆరోజు చనిపోయేవాడ్ని!

ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది.

ఉరుము ఉరిమింది.

ఒక పిడుగు మెరుపుతో మెరుపువేగంతో నా కొమ్మ ఒకటిని ఛేదించుకుంటూ నేల మీద పడింది. పెద్ద గొయ్యి ఏర్పడిపోయింది.

పిడుగుదెబ్బకి తట్టుకోలేక విలవిలలాడిపోయాను.

ఆ పిడుగు దెబ్బకి నా కొమ్మ మెల్లిమెల్లిగా ఎండుకుపోయింది. నాన్నగారు ఎండిపోయిన కొమ్మని చూసి పసివాడిలా ఏడ్చేశారు.

ఎండిపోయిన కొమ్మని కొట్టివేయమని అందరూ సలహా ఇచ్చారు.

''వద్దు. వద్దు. అట్లాగే ఉండనీయండి. నా కళ్ళెదుట ఆ కొమ్మని నరకవద్దు. నా గుండె తట్టుకోలేదు. వద్దు. మరోసారి ఈ మాట నా దగ్గర ఎత్తవద్దు..'' అన్నారు అసహనంగా.

కాల వైపరీత్యం. ఒక్కొక్క సంవత్సరం ఎండలు ఒక్కొక్క మాదిరిగా బండలు పగలగొట్టేస్తున్నాయి.

పంటలు లేవు. చేతికి పని లేదు.

సూరీడు చదువుకి డబ్బులు పంపించాలి. నాన్నగారు భయపడిపోయారు.

అప్పుడు నా ఒళ్ళంతా కాయలు కాచాయి. బాగా కాచాయి.

నాన్నగారు సంతోషంతో మీసాలను దువ్వుకున్నారు.

అందరితో ''నా పెద్దకొడుకుంటే నాకేం భయం?'' అన్నారు ధీమాగా.

నా కాయలన్నీ అమ్మేశారు.

మంచి ధర పలికింది.

సూరీడు చదువుకి ఆటంకం కల్గలేదు.

నాన్నగారికి నేనంటే మరీ ప్రాణమైపోయాను.

సూరీడు చదువు పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగం కూడా సంపాదించుకున్నాడు. మా ఊరికి రావడానికి మాత్రం నిరాకరించాడు.

''ఇంత చదువు చదివి ఇంకా గుడిసెలో ఉండమంటారా? నా వల్ల కాదు..'' అన్నాడు.

నాన్నగారు అప్పుడేమీ అనలేదు.

''ఇంకా యీ వూర్లో ఏముంది నాన్నా? యీ ఇల్లూ, యీ చెట్టుని అమ్మేసి నాతో వచ్చెయ్యండి. అక్కడ ఇల్లు కట్టుకుందాం'' అని సూరీడు చెప్పినప్పుడు నాన్నగారికి ఎన్నడూ రానంత కోపం వచ్చేసింది.

''రాను. నేనెక్కడికీ రాను. ఈ వూరిని, యీ ఇంటిని ముఖ్యంగా నా పెద్దకొడుకుని విడిచి నేను రాలేను. కావాలంటే మీ అమ్మని తీసుకెళ్ళు'' అన్నారు ఖండితంగా. ఆయన కళ్ళనిండా కన్నీళ్ళు.

నాన్నగారి కన్నీళ్ళను చూశాను. ఏడుపువచ్చేసింది. ఏడ్చేశాను. ఆకుల గలగలతో ఆయనకి దణ్ణం పెట్టాను.

అమ్మ కూడా పట్నం వెళ్ళడానికి నిరాకరించింది.

సూరీడు వెళ్ళిపోయాడు.

ఉద్యోగం చేస్తున్న కొడుకుని ఒంటరిగా ఉంచడం సబబు కాదని ఒక మంచి సంబంధం చూసి వాడికి పెళ్ళి చేసేశారు.

సూరీడు సంసారంలో పడిపోయాడు.

సంవత్సరం తిరక్కముందే సూరీడికి కొడుకు పుట్టాడు.

ఒకరోజు ''అబ్బాయి డబ్బులు పంపించడం లేదండి..'' అన్నది సావిత్రమ్మ.

''పట్నంలో కాపురం అంటే మాటలా? వా

ఖర్చులు వాళ్ళుకున్నాయి..'' అన్నారు పైకి. కానీ ఆయన మనసులోని బాధ నాకు తెలుసు.

నేను గమనిస్తున్నాను. వాళ్ళిద్దరిలో పెద్ద మార్పు వచ్చేసింది. ఒకరి సహాయం లేకుండా మరొకరు సాఫీగా నడిచే పరిస్థితిలో లేరిప్పుడు.

ఈసారి వర్షాలు పడలేదు. వడదెబ్బలకి మనుషులు వడలిపోతున్నారు. జంతువులూ, పక్షులూ నోళ్లు తెరుస్తున్నాయి.

నేనెట్లాగో సర్దుకుంటున్నాను. గుడ్డిలో మెల్ల! లోతుగా పాతుకుపోయిన నా వ్రేళ్ళు నాకు నీళ్ళు అందిస్తున్నాయి. ఎండిపోయిన కొమ్మ అట్లాగే వుంది.

ఎండ దెబ్బకి నాన్నగారు మంచాన పడ్డారు. లేవలేని పరిస్థితికి వచ్చేశారు.

''ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం. అబ్బాయి దగ్గరకి వెళితే మంచి డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళి చూపిస్తాడు. నయం అయిపోతుంది.''

అమ్మ మాట విని చిరాకుపడ్డారాయన.

''వద్దు. ఆ మాట అనొద్దు. నా పెద్దకొడుకును వదిలి నేనెక్కడికీ రాను. నేను చస్తే వీడి నీడలోనే చస్తాను..'' అన్నారు.

అలాంటి మొండి పట్టుదల ప్రస్తుతం మంచిది కాదని చెప్పాలనుకున్నాను.

ఎలా చెప్పను?

నాన్నగారి పరిస్థితి విషమించింది. అందరూ పెదవి విరిచారు. కొడుక్కి మనిషి చేత కబురంపారు. అక్కడ సూరీడు కొడుకు హాస్పిటల్లో ఉన్నాడట! అపెండిసైటిస్ ఆపరేషన్ చేస్తున్నారు. వీలు చూసుకుని వస్తానని జవాబిచ్చి పంపించాడు.

''నన్ను వాకిట్లో పడుకోబెట్టండి. నా పెద్దకొడుకుని చూసుకుంటూ కళ్ళు మూస్తాను..''

అది ఆయన చివరి కోరిక!

అట్లాగే చేశారు.

నాన్న నావైపు కరువుదీరా చూశారు.

''యీ మనుషులకి బుద్ధిలేదురా. చెట్లను కొట్టి మేడలు మిద్దెలు కట్టేసుకుంటున్నారు. అందుకే వర్షాలు లేక అల్లల్లాడిపోతున్నారు. ఇంటికొకడు నీలాంటి వాడు ఒకడుంటే దేశం బాగుపడుద్ది..'' ఆయన గొణుక్కుంటున్నారు.

ఆ మాటలు నాకు స్పష్టంగా వినిపించాయి.

నాన్నగారు నా వైపు చూస్తూ చివరి శ్వాస వదిలేశారు.

నా అణువణువు ముక్కలైపోతున్నట్లు బాధ.

సూరీడు రాలేని పరిస్థితి.

శవాన్ని చాలాసేపు ఉంచకూడదని అందరూ అనుకుంటున్నారు.

సూరీడు కోసం అమ్మ ఒక్కరోజు ఎదురుచూసింది.

అంత్యక్రియలకు డబ్బు లేదు. కనీసం కట్టెలకోసం డబ్బు కావాలి.

అమ్మ వెక్కిపెడుతుంటూ బావురుమంటోంది.



నేనిక భరించలేకపోయాను. బలవంతంగా ఒళ్ళు విరుచుకున్నాను. ఎండిపోయిన నా కొమ్మ అమాంతంగా నేలకొరిగిపోయింది.

బాధ! అయినా ఈ బాధలో ఎంతో తృప్తి కల్గుతోంది.

అమ్మ కొమ్మని చూసింది. నావైపు చూసింది. మళ్ళీ కొమ్మని చూసింది. నాన్నగారి చెంపలమీద చెయ్యేసి ''చూడండీ, మీ పెద్దకొడుకు మీ అంత్యక్రియల కోసం కొమ్మని పడేశాడు. మీ పెద్దకొడుకుని ఒక్కసారి కళ్ళు తెరిచి చూడండి..చూడండీ...''

అమ్మ నాన్నని హత్తుకుని ఏడుస్తుంటే అక్కడున్న వాళ్ళందరూ ఏడ్చేశారు. నా ఆవేదనకి అదుపు లేకుండా పోయింది.

కొడుకు రాలేదని ఆవేదన్లో అమ్మ ఒక నిర్ణయానికి వచ్చింది. బంధువులందరి ముందు మనసులోని మాట చెప్పేసింది.

''మా ఆయనకి తల కొరివి నేనే పెడతాను.''

తర్జనభర్జనలు జరిగాయి. అమ్మ పట్టుపట్టింది. చివరికి అమ్మ మాటే నెగ్గింది.

ఎండిపోయిన నా కొమ్మని నాన్నగారి అంత్యక్రియలకు వాడుతున్నారు.

నా జీవితం ధన్యమైపోయింది.

తలకొరివి పెట్టలేని నన్ను ఆయన అంత్యక్రియలకు నా శరీరంలోని ఒక పెద్ద భాగాన్ని సద్వినియోగం చేస్తున్నారు. ఇది చాలు. నాలోని అవయవం ఒక ముఖ్య కార్యం కోసం ఉపయోగపడుతుంటే, అంతకంటే కావాల్సిందేముంది?

నాలాంటి నోరులేని చెట్లకి ఈపాటి అదృష్టం చాలు!

నన్ను ఒక చెట్టుగా పుట్టించిన ఆ భగవంతునికి మనసారా కృతజ్ఞతలు అర్పించుకుంటున్నాను. మళ్ళీ జన్మంటూ ఉంటే నాన్నగారి పెద్దకొడుకుగా పుట్టాలని ప్రార్థిస్తూ వీడ్కోలు చెప్పాను–మౌనంగా.

★